# చీకటమ్మా! చీకటి!



మొండి చేతులు రెండిట్ని ఒకదానిపై ఒకటి 'టప్' మంటూ కొట్టి, పగిలిన భిక్షా పాత్రలాంటి చేతిని ముందుకు సాచాడు హాస్పటల్ గేటు ముందున్న లెప్పర్.

యాభై పైసల బిళ్ళ అతని చేతిలో వేస్తూ అతని వైపు దీక్షగా చూసింది పార్వతి. వయసును తెలిపే ఆధారాలేమీ లేవు ఆ ముఖంలో. వెలగని రెండు మట్టి ప్రమిదల్లాంటి కళ్ళు. వాటిక్రింద లోపలికి క్రుంగిన ముక్కు, పెదాలు బండబారి, ముఖంపై కణుతులు మొలుచుకువచ్చి అతి పురాతనమైన 'ఎర్రకోట' బొమ్మలా ఉన్నాడు. వాడి కల్లంత దూరంలో చెక్కతొట్టి, అందులో మరో ఆడ లెప్పర్. తొట్టి చుట్టూ పారాడుతున్న రెండేళ్ళ పసివాడు. వాళ్ళచుట్టూ మూగే లక్షలాది నేత్రాల జుగుప్సను, అసహ్యాలను పట్టించుకోని వాళ్ళ స్పర్శారాహిత్యం ఆశ్చర్యాన్ని కలిగించింది పార్వతికి.

గేటు దాటి లోపలికి వెళ్ళింది. గైనకాలజీ ఒ.పి. బెంచీలపై మాంసపు ముద్దల్లాంటి శరీరాల్ని 'కూలవేసి, వైరాగ్యంగా నిర్లిప్తంగా లేడీ పేషంట్లు.

మల్లెపూవులు, మధురమైన రాత్రులు, వెన్నెలవనాలు, వాటిల్లో విహరించే ఉన్మత్త పారవశ్యాలు... ఈ ఆడవాళ్ళేనా అనిపిస్తుంది.

"జరగండి! జరగండి డాక్టరమ్మ వస్తుంది! కడుపుతున్న వాళ్ళంతా ఆ వైపు బల్ల వద్దకు రండి!' ముసలి ఆవులాంటి నర్సు వికృతంగా అరుస్తుంది.

...."రెండు నెలలుగా నేప్‌కిన్స్ కొనడం లేదే?" రెహమాన్ అడిగాడు క్యూరియాసిటీతో. "పిరియడ్స్ రావటంలేదు..." అతని ముఖంలోకి చూస్తూ చెప్పింది. కొంచెం సిగ్గు, చిరునవ్వూ మిళితమైన స్వరంతో. నిశ్శబ్దాన్ని చీలుస్తూ 'ముబారక్‌హో...!' అన్నాడు తన సహజమైన అల్లరిని ఆ అరుపులో మేళవిస్తూ......

"పెళ్లయిందా మీకు?"

కుర్రడాక్టరమ్మ అనుమానాన్ని ఆపుకోలేక అడిగింది. మెడలో తాళి, కాళ్ళకు మెట్టెలు కనబడక.

"అయ్యింది! అవి వేసుకోలేదు. నమ్మకంలేక..."

"మొదటి కాన్పుకదా! ఎందుకుతీయించుకోవాలనుకుంటున్నారు."

పార్వతి మాట్లాడలేదు.

"అదీగాక మూడు నెలలు దాటింది... కొంచెం కష్టంకావచ్చు... మరో సారి ఆలోచించుకోండి!"

పార్వతి మాట్లాడలేదు. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వాటిని ఆపుకొనే ప్రయత్నం చెయ్యలేదు. అవి అలాగే చెంపలపై పారాడాయి కాసేపు.

"రేపు పొద్దున్నే వార్డుకిరా... కడుపులోకి ఏమీ తీసుకోకుండా....రా!" మందుల చీటి రాసిచ్చింది.

బయట వరండా లేడీ పేషంట్లతో క్రిక్కిరిసి ఉంది. నిర్లిప్తంగా, వేలాడతీసిన యంత్రాల్లా... ఇవరవై, ముప్పయి, నలభై, వయసుల వారీగా నిలబడ్డ యంత్రాలు. వీళ్ళలోని బాల్యపు నవ్వుల పరిమళాలు, యవ్వన మధుస్వప్నాలు ఏమై పోయాయి? అన్నీ దోచుకుపోగా, ఒట్టి గోడలు, కప్పులతో మిగిలిపోయిన ఇళ్ళలా ఎందుకింత ఖాళీగా శూన్యంగా ఉన్నారు?

వరండాలోంచి చూస్తే దూరంగా హంసల గుంపు బిరబిరా నడుచుకుంటూ పోతున్నట్లుగా... తెల్లగౌనుల నర్సులు డ్యూటీలకు తరలి వస్తున్నారు. గుంపు లోంచి చీలి పదిమంది నర్సులు, వరండాలోకి అడుగు పెట్టారు. "ఎందుకట్లా త్రోసుకుంటారు... సరిగ్గా ఉండలేరా? వెదవసంత! పోయి అటు బల్లలపై కూర్చోండి!" వాళ్ళలోంచి ఒకనర్సు పెద్దగా అరిచింది. ఇవి మామూలు హంసలు కాదు. రాక్షస హంసలు అనుకొంది పార్వతి.

"నువ్వు పరమేశ్వరరావుగారి అమ్మాయివి కదూ...!" అల్లంత దూరంలో బల్లపై కూర్చుని గాజు కళ్ళతో తినేసేలా చూస్తున్న ముళ్ళపందిలాంటి ఆడమనిషిరొప్పుకుంటూ పార్వతివైపు వచ్చింది.

"ముస్లిం కుర్రవాణ్ణెవడ్నో పెళ్ళి చేసుకున్నట్టున్నావు? నువ్వు చచ్చిపోయ్యావని శ్రాద్ధం పెట్టి నానా కంగాళీ చేసాడు మీ నాన్న..." పార్వతికి అనీజీగా ఉంది. ముట్టెతో మురికి కుప్పను కెలుకుతున్న పందిని చూస్తే కలిగే అసౌకర్యపు భావన లాంటిది.

"వాడైనా సరిగ్గా చూసుకుంటున్నాడా? లేకపోతే వాడూ వదిలేశాడా?...." సమాధానం చెప్పకుండా బయటకు వచ్చేసింది పార్వతి. "ఓసి... దీని టెక్కు... ఎవడితోనంటే వాడితో..." మిగిలిన మాటలు పార్వతికి వినబడలేదు. వరండాలో ప్రవహిస్తున్న శబ్ద కాలుష్యంలో కలిసిపోయాయి.

హాస్పటల్ బయట మొండిచేతుల లెప్పర్ కుటుంబం మళ్ళీ ప్రత్యక్షమయింది. ట్రాఫిక్ పోలీసు ఒకడు కర్ర వూపుకుంటూ బూతులు తిడుతూ వస్తున్నాడు. బహుశా

వాళ్ళను తరిమి కొట్టడానికి కాబోలు. హాస్పటల్ గోడపై నినాదమేదో రాస్తున్న పద్నాలుగేళ్ల కుర్రవాడు పోలీసును చూసి పారిపోయాడు. "హిందూదేశం మనది.... హైందవులం మనం..." పూర్తికాని నినాదం... కుదురుగాలేని అక్షరాలు. గొగ్గిరిగొగ్గిరిగా ఉన్నాయి. హడావుడిగా రాసిన అక్షరాలపై కాషాయపురంగు అటూయిటూ పడి వికృతమైన మరకల్లా ఉన్నాయి.

...."నాకెందుకో భయంగా ఉంది పార్వతీ!" రెహమాన్ ముఖం పాలిపోయి ఉంది. "ఎక్కడికైనా పారిపోవాలని ఉంది. ఈ మనుషులు, మతాలు, కొట్లాటలు లేని ఇంకేదైనా ప్రపంచంలోకి..." స్వగతంలా గొణుక్కుంటున్నాడు రెహమాన్....

ఆ రాత్రి ఊరంతా కర్ఫ్యూ. అంతటా నిర్మానుష్యం. ఊరి చివర ఎక్కడో తగల బెట్టబడ్డ బస్సు నుంచి వచ్చే పొగలు ఊరిపై నల్లని ముసుగేదో కప్పినట్లుగా ఆవరించాయి. ఆ మధ్యాహ్నం జరిగిన కొట్లాటలో నలుగురు చనిపోయారు. ఇద్దర్ని సజీవదహనం చేశారు. కాలిన శరీరాల్లోంచి వచ్చే కమురువాసన వీధులనిండా అలముకొని ఉంది. రోడ్డుపై అప్పుడప్పుడు పోలీసు ట్రక్కుల శబ్దాలు మినహా మరే చప్పుడులేదు.

ఒడిలో రెహమాన్ తల నిమురుతూ, ఓదార్పుని, ధైర్యాన్ని తన స్పర్శద్వారా అందిస్తున్న సమయంలో... రెహమాన్ లోపల ఏ పెనుభయమో కదలాడి ఒక్కసారిగా పొగిలిపొగిలి ఏడ్చాడు. అతని జుట్టు నిమురుతూ...."జీవితంలో కెల్లా గొప్ప విషాదం మరణంకాదు. మన లోపల వెచ్చగా పారాడే ఆలోచన, హేతువు, తెగింపు చనిపోవటమే నిజమైన విషాదం! ఇంత బేలవైతే ఎలాగు!...."

"ఈ అందమైన మాటలు పుస్తకాల్లో వ్రాసుకోడానికి, మీటింగుల్లో ఉపన్యసించ డానికి...బాగుంటాయి. కత్తులతో, బాంబులతో వెంటాడే ఈ వాస్తవం మాటేమిటి?" రెహమాన్ కోపం, దుఃఖం మిళితమైన స్వరంతో అరిచాడు....

హాస్పటల్ బయట చనిపోయిన మనిషికోసం, హృదయ విదారకంగా ఏడుస్తున్నారు ఇద్దరు ఆడవాళ్ళు. ఒ.పి.గేటు దగ్గర కేకలు, అరుపులు, మేం ముందంటే మేమని తోసుకోవడాలు. మరణమనే మహాగ్ని నాలుకలు సాచి పక్కనే పారాడుతున్నా వీళ్ళల్లో 'మేము' అనే స్వార్థం చావదు. గేటు దగ్గర వాచ్‌మెన్ తన అర్థరూపాయి మామూలు కోసం చేతులు సాచే ఉన్నాడు.

పచ్చి బాలింత ఒకతె చేతుల్లో రోజుల శిశువుతో, తల్లో, అత్తో వెంటరాగా గేటు బయటకు వచ్చింది. టెంకాయ దిష్టి తుడిచి ఆమె ముందు 'టప్' మని పగల గొట్టిందా పునిస్త్రీ. అప్పుడే విచ్చుకొన్న లేత గులాబీలా, ఎర్రగా మృదువుగా ఉందాపాప. కళ్ళుతెరిచి ప్రపంచాన్ని వింతగా చూస్తుంది. శిశువు కళ్ళలోని స్వప్నలిపిని చదవగలిగితే బాగుణ్ణు! మానవుల కోసం దేవుడు పంపిన ఏ సందేశాన్ని వెంటతెచ్చాడో?

పార్వతికి లోపల పేగు కదిలినట్లనిపించి, హఠాత్తుగా దుఃఖం వేసింది. "నన్ను క్షమించు పాపాయీ!" పొట్ట నిమురుకుంటూ దిగులుగా అనుకొంది.

"మనకు పిల్లలు వద్దు!" తన నిర్ణయాన్ని చెప్పాడు రెహమాన్ జీవంలేని కళ్ళతో.

"ఎందుకని".... అసహనంగా అడిగింది పార్వతి.

"హిందువుగానో, ముస్లింగానో తప్ప మనిషిగా జీవించలేని పరిస్థితులున్న దేశంలోకి నా బిడ్డను ఆహ్వానించలేను."

దుఃఖంతో పూడుకుపోయి ఉంది రెహమాన్ కంఠం.

"ఏమిటీ పిచ్చి!" సానుభూతిగా అంది పార్వతి.

"ఈ విషాదాల్ని మనతోనే ఆగిపోనివ్వు! మరోతరానికి ఎందుకు కొనసాగనివ్వటం! రేపే హాస్పటల్‌కి వెళ్ళి... అబార్షన్..." పార్వతి గుండెల్లో తల పెట్టుకొని చాలాసేపు ఏడ్చాడు రెహమాన్...

హాస్పటల్ గేటుదాటి రోడ్డుపై కొచ్చింది పార్వతి. సిటీ బస్సు ఒకటి నిండు గర్భిణిలా పొరాడుతూ వచ్చింది.ఆగగానే గుంపులు గుంపులుగా మూగారు జనం. బస్సు ఎక్కడానికి ప్రయత్నించింది పార్వతి. మానవశరీరాల వత్తిడి, కంపు. ఎవరికి వాళ్ళు ముందు ఎక్కాలని. ఆ తోపుడులో పార్వతి వెనకబడి పోయింది. బస్సు వెళ్ళిపోయింది. చక్రాల్ని బరువుగా దొర్లించుకుంటూ. రోడ్డు అంతా ఖాళీగా ఉంది.

మొండి చేతుల లెప్పర్ మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు. తోపుడు బండి. అందులోని వాడి లెప్పర్ ప్రేయసి, తోపుడు బండి చుట్టూ పారాడే పిల్లలు- మొండి చేతుల్ని రెండూ 'టప్' మని కొట్టి, భిక్షా పాత్రలాగా ఒక చేతిని ముందుకు సాచాడు. ఇంకో అర్ధరూపాయి వాడి చేతుల్లో పెడుతూ, వాడి మొండి చేతులవైపు చూసింది. స్పర్శ జ్ఞానంలేని చేతులు. ఏ అనుభూతీ అంటని చేతులు.

పార్వతికి తనలోనూ లెప్రసీ లక్షణాలున్నట్లనిపించింది. తనకేకాదు. తనచుట్టూ రోడ్డుపై కులాసాగా నడుచుకుంటూ వెళ్ళే జనంలోనూ. ఈ దేశపు పౌరులందరిలోనూ ఈ లక్షణాలున్నట్లనిపించింది. సర్శారాహిత్యం ఎన్ని విషాదాలు జరిగినా, ఎన్ని మారణ హోమాలు జరిగిన ఏమీ పట్టనట్లే జీవించగలిగే నిర్లిప్తత.

హఠాత్తుగా పార్వతి ముందో చెయ్యి ప్రత్యక్షమయింది. "ఆంటీ! జాయిన్ యువర్ హేండ్స్!" ఆరేడేళ్ళ పాప. కాన్వెంటు యూనిఫారంలో ముచ్చటగా అందంగా డెకరేట్ చేసిన పుష్పగుచ్ఛంలా ఉంది.

"సెక్యులరిజానికి మద్దత్తుగా, మానవహారాన్ని నిర్మిస్తున్నాము. రండి! చెయ్యికలపండి!" అంది పెద్ద ఆరిందాలా.

అప్రయత్నంగానే తన చెయ్యిని అందించింది పార్వతి. పార్వతి చేతిని మరో చెయ్యి. ఆ చేతిని మరో చెయ్యి- అనంతంగా సాగిపోతుందా మానవహారం.

పార్వతికి ఉద్వేగంగా ఉంది. అంతవరకు విగతంగా ఉన్న హృదయ పుష్పంలో వెచ్చని వూపిరి పారాడినట్లుగా ఉంది.

లోపల శిశువు అటు ఇటూ కదలాడి "నన్నూ చేయి కలపనీ...." అన్నట్లుగా తోచి, సన్నగా నవ్వుకుంది పార్వతి.

• ఆహ్వానం మాసపత్రిక, అక్టోబర్ 1993 •